www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 మార్చి 2025
5
పశ్చిమ గోదావరి



8న జాతీయ లోక్ అదాలత్

తణుకు: ఈ నెల 8వ తేదీన ఉమ్మడిగోదావరి జిల్లాతో పాటు రాష్ట్రంలో కోర్టులు పనిచేసే ప్రతిచోటా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సత్యవతి మాట్లాడుతూ ప్రతి కేసును రాజీ చేసే దిశగా పోలీసులు కృషి చేయాలన్నారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి లోక్ అదాలత్ ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడు క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, ప్రామిసరీ నోటు కేసులు, కుటుంబ తగాదా కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, టెలిఫోన్, బ్యాంకు బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.



'సాగునీటి'కి
అరకొర నిధులు..!

- చింతలపూడి ఎత్తిపోతలకు రూ.222 కోట్లే
- తాడిపూడి ఎత్తిపోతలకు రూ.14 కోట్లు
- డెల్టా ఆధునికీకరణకు ఉమ్మడి 'పశ్చిమ'కు రూ.11కోట్లు విదిలింపు
- పోలవరానికి రూ. 6,705 కోట్లు
- నరసాపురంలో ఆక్వా యూనివర్సిటీకి రూ.36 కోట్లు
- ఆక్వా, వరి రైతులకు ప్రోత్సాహకాలు కరువు
- కౌలురైతులకు మొండిచెయ్యి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశ పెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అరకొర కేటాయింపులతో సరిపెట్టింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపేలా బడ్జెట్ కేటాయింపులు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయానికి అత్యంత అవసరమైన సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపుతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. మెట్ట ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల. ఈ ప్రాజెక్టు దశాబ్దాల కాలంగా కొనసాగుతూనే ఉంది. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నుంచి ఎంపీలు, ఎంఎల్‌ఎలు పదేపదే చెబుతూనే ఉన్నారు. ఈ ప్రాజెక్టు పనులను రెండు దశల్లో పూర్తి చేస్తామని చెప్పారు. అందుకు మొత్తం రూ.3,782 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. మొదటి దశ పనులు 2026వ పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఏడాదికి చింతలపూడి మొదటి దశ పూర్తి కావాలంటే రూ.1500 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మాత్రం రూ.222 కోట్లు మాత్రమే కేటాయించారు. చింతలపూడి మొదటిదశ ఏవిధంగా పూర్తి చేస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. మెట్ట ప్రాంతంలో మరో సాగునీటి ప్రాజెక్టు తాడిపూడి ఎత్తిపోతల పథకం. ఈ ప్రాజెక్టు ప్రారంభించి దశాబ్దాలు గడిచినా పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని పరిస్థితి ఉంది. ఈ ప్రాజెక్టు పిల్ల కాలువలు పూర్తి చేయాల్సి ఉంది. రూ.200 కోట్లు కేటాయిస్తే ఈ ప్రాజెక్టు పనులు చాలావరకూ పూర్తయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. బడ్జెట్‌లో మాత్రం రూ.14 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. డెల్టా ప్రాంతంలో కాలువల ఆధునికీకరణ అత్యంత ప్రధానమైంది. పంట కాలువలు మెరకదేరి ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంటను రైతులు నష్టపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా గాలికొదిలేసింది. ఈ ప్రభుత్వమైనా పట్టించుకుంటుందని రైతులు ఆశగా ఎదురుచూశారు. తూర్పు, పశ్చిమ ఉమ్మడి జిల్లాలకు డెల్టా ఆధునికీకరణ పనులకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.21 కోట్లు వరకూ కేటాయించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు రూ.11 కోట్లు వరకూ వచ్చే అవకాశం ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు రూ.వెయ్యి కోట్లు వరకూ డెల్టా ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. దీంతో డెల్టా రైతాంగం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది.

నిర్వాసితుల పునరావాసానికి అరకొర నిధులు

పోలవరం ప్రాజెక్టుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.6,705 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ప్రాజెక్టు నిర్వాసితులకు అందించే సాయానికి మాత్రం రూ.23 కోట్లే కేటాయించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో దాదాపు లక్ష కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 21 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.55 వేల కోట్లు వరకూ ఖర్చవుతుందని, అందులో నిర్వాసితుల పునరావాసానికి రూ.33 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. 2026కు ప్రాజెక్టు మొదటిదశ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ అందించడంతోపాటు కాలనీల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఇటువంటప్పుడు ఆర్అండ్ఆర్‌కు కేటాయించిన రూ.1410 కోట్లు ఎలా సరిపోతాయో ప్రభుత్వమే చెప్పాలి.

ఆక్వా యూనివర్శిటీకి రూ.36 కోట్లు

వ్యవసాయ బడ్జెట్‌ను ఈ ఏడాది రూ.48,441 కోట్లతో ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. నరసాపురం ప్రాంతంలో ఏర్పాటైన ఆక్వా యూనివర్సిటీకి తరగతులు ప్రారంభమైనా సొంత భవనాలు లేకుండాపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా యూనివర్సిటీకి బడ్జెట్‌లో రూ.36 కోట్లు నిధులు కేటాయించారు. ఆక్వా, వరి రైతులకు మాత్రం బడ్జెట్‌లో ఎటువంటి ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. గతం నుంచి అమలవుతున్న విద్యుత్ సబ్సిడీ గురించి మాత్రమే ప్రస్తావించారు. ఆక్వా మేత ధరలు పెరిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరల హెచ్చుతగ్గులతోనూ నష్టాలు చవిచూస్తున్నారు. ఆక్వా రైతులకు ఊరటనిచ్చే నిర్ణయాలు బడ్జెట్‌లో లేకుండాపోయాయి. వరి రైతులకు బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. పామాయిల్ అంశంలో కొత్త తోటల సాగుకు సంబంధించిన ప్రస్తావించడం తప్ప రైతులకు మేలు చేసే నిర్ణయాలు కనిపించలేదు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చెప్పారు. బడ్జెట్‌లో నిధులు మాత్రం కేటాయించలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవకు రూ.9,400 కోట్లు కేటాయించారు. అదే సందర్భంలో కౌలురైతుల ప్రస్తావన లేకుండాపోయింది. కౌలురైతులకు మొండిచెయ్యి చూపిన పరిస్థితి నెలకొంది. దీంతో రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పథకాలు బారెడు.. కేటాయింపులు మూరెడు

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం

పథకాలు బారెడు.. కేటాయింపులు మూరెడు అన్నట్లుగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. రూ.3.22 లక్షల కోట్లతో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు లేవు. సూపర్ సిక్స్‌లో ఒక్కటైన యువతకు నిరుద్యోగ భృతి ప్రస్తావన లేకపోవడం మోసగించడమే. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపాల్టీ వర్కర్స్‌కు బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. ప్రభుత్వ పథకంతో ఇళ్లు నిర్మించుకున్న పేదలందరూ లక్షల రూపాయల అప్పుల్లో కూరుకుపోయారు. అయితే గృహ నిర్మాణ సహాయం పెంచే విధంగా బడ్జెట్ కేటాయింపులు లేవు. మొత్తంగా బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది.

బడ్జెట్‌లో మొండిచేయి

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి, భీమవరం

నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు వంటి సూపర్ సిక్స్ హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించ లేదు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకూ సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీల అమలుకు బడ్జెట్‌లో మొండి చేయి చూపించింది. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ప్రభుత్వోద్యోగాల కల్పన ఊసే లేదు. తల్లికి వందనం రెండేళ్లకు సుమారు రూ.25 వేల కోట్లు అవసరం కాగా కేవలం 9,400 కోట్ల రూపాయలే కేటాయించారు. అన్నదాత సుఖీభవ అమలుకు రైతులకు ఏడాదికి 20 వేల రూపాయలు అందిస్తామన్న ప్రభుత్వం హామీ అమలుకు అరకొర నిధులే కేటాయించింది. బడ్జెట్‌లో తగిన విధంగా నిధులు కేటాయించకపోవడం సరికాదు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

జిల్లాలో పరీక్షలు రాయనున్న 37,930 మంది విద్యార్థులు
52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
నిమిషం ఆలస్యమైనా అనుమతి లేనట్టే
52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్మెంట్ ఆఫీసర్లు ,
నాలుగు సిట్టింగ్ స్క్వాడ్, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు
900 మంది ఇన్విజిలేటర్ల నియామకం
నిఘా నేత్రంతో పరీక్షల నిర్వహణ, 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటుకు సంబంధించి 121 ఇంటర్మీడియట్ కళాశాలలకు చెందిన సుమారు 37,930 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరగనుంది. పరీక్షా కేంద్రానికి గంట ముందే విద్యార్థులు రావాల్సి ఉంది. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని, ఇప్పటికే అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 21 నుంచి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ప్రతి విద్యార్థీ పరీక్షలకు హాజరు కావాలనే ముఖ్యోద్దేశంతో ఇంటర్ బోర్డు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి అమలు చేసింది. ఈ నేపథ్యంలో హాజరుతో సంబంధం లేకుండా ఫీజు చెల్లించే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేసి పరీక్షలకు అనుమతించే విధంగా చర్యలు చేపట్టింది. దీంతో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈనెల 20వ తేదీ వరకూ పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 20,437 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 17,032 మంది కలిపి మొత్తం 37,930 మంది పరీక్షలు రాయనున్నారు. 52 పరీక్షా కేంద్రాలకు 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్మెంట్ ఆఫీసర్లను నియమించడం జరిగింది. అలాగే 4 సెట్టింగ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్, మరో నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కేంద్రాల్లో 900 మంది వరకూ ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షలు నిర్వహణకు పట్టిష్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. అలాగే సెల్‌ఫోన్ రహిత కేంద్రాలుగా ప్రకటించారు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలతో పాటు తాగునీరు ఏర్పాటు చేయడం జరిగింది. నిరంతరం విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరయ్యే విధంగా ఆర్‌టిసి బస్ సర్వీసులు నడిపేందుకు సైతం చర్యలు చేపట్టారు. పరీక్షలు రాసే ప్రతి విద్యార్థీ ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డిఐఇఒ ఎ.నాగేశ్వరరావు తెలిపారు.



భీమవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

గుడ్లు, చికెన్ నిరభ్యంతరంగా తినొచ్చు
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వేల్పూరులోని కృష్ణా నందం కోళ్ల ఫారం నుంచి కిలో మీటరు పరిధిలో పెదతాడేపల్లి గ్రామంలోని రామలక్ష్మి కోళ్ల ఫారం నుంచి కిలోమీటరు పరిధిలో మినహా జిల్లాలోని అన్ని గ్రామాల్లో గుడ్లు, చికెన్ అమ్మడానికి ఏ విధమైన ఆంక్షలూ లేవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలు అపోహలు పెట్టుకోకుండా ఉడికించిన గుడ్లు, ఉడకబెట్టిన కోడిమాంసం తినొచ్చని తెలిపారు. చికెన్, గుడ్ల షాపులు, రెస్టారెంట్ యజమానులు వ్యాపారాలు కొనసాగించొచ్చని స్పష్టంచేశారు.



పశువ్యాధి నియంత్రణ పథకాన్ని వినియోగించుకోవాలి

జిల్లాలోని పాడి రైతులు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం వాల్‌పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మార్చి ఒకటి నుంచి 30వ తేదీ వరకూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయించడం వల్ల పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వత నివారణ, మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా అరికట్టడం, దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, డిడి జవ్వారు హుస్సేన్, సహాయ సంచాలకులు గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

గెలుపు కోసం దొంగ ఓట్లు..!

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అడ్డదారులు
మధ్యాహ్నం 2 గంటలు తర్వాత భారీగా దొంగ ఓట్లు పోలైనట్లు ఆరోపణలు
మొదటి 6 గంటల్లో 45.29 శాతం పోలింగ్ నమోదు
చివరి 2 గంటల్లో 25 శాతం వరకూ పోలింగ్
జిరాక్స్ ఐడి కార్డులతో ఓటుకు అనుమతించిన అధికారులు
ఏడెనిమిది శాతం దొంగ ఓట్లు పోలైనట్లు జనాల్లో చర్చ
ఎన్నికల అధికారులు, పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీ అడ్డదారులు తొక్కడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దూరప్రాంతాల్లో ఉండి రానివారి ఓట్లను అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలే వేసేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల అధికారులు, పోలీసులు పూర్తిస్థాయిలో అధికార పార్టీ నేతలకు సహకరించడంపై తీవ్ర చర్చ సాగుతోంది. నిబంధనల ప్రకారం ఒరిజినల్ ఐడి ప్రూఫ్ చూపిస్తేనే ఓటు వేసేందుకు అనుమతివ్వాలి. అయితే జిరాక్స్ ఐడి ప్రూఫ్‌తో ఓటేసేందుకు పోలింగ్ బూత్‌లోని అధికారులు అనుమతివ్వడం నిబంధనలకు విరుద్ధం. పలుచోట్ల దీనిపై నిలదీయడం, ఘర్షణలు జరిగినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ సాగింది. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతాన్ని అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య జరిగిన పోలింగ్ సరళిని చూస్తే దొంగ ఓట్లు భారీగా పోలైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్నం రెండు గంటలకు అధికారులు విడుదల చేసిన పోలింగ్ లెక్కల ప్రకారం 45.29 శాతం ఓటింగ్ జరిగింది. అప్పటి వరకూ మొత్తం 3,14,984 ఓటర్లకుగాను 1,42,647 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అప్పటికి పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలు పూర్తయ్యింది. మరో రెండు గంటలు మాత్రమే పోలింగ్ సమయం మిగిలింది. ఇంకా పెద్దఎత్తున ఓటర్లు వచ్చినా 60 శాతం పోలింగ్ మించదని అంతా అంచనా వేశారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో జరిగిన మొత్తం పోలింగ్ 69.50 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకూ జరిగిన పోలింగ్ ఏకంగా 25 శాతం వరకూ ఉంది. చివరి రెండు గంటల్లో 76 వేలకుపైగా ఓట్లు పోలయ్యాయి. ఇదెలా సాధ్యమో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేసేందుకు సమయం పడుతోంది. బ్యాలెట్ మడత పెట్టి ఇవ్వడం, మళ్లీ ఓటువేసి జాగ్రత్తగా మడత పెట్టి బ్యాలెట్ బాక్సుల్లో వేసేందుకు కొంత సమయం పడుతోంది. అలాంటిది చివరిలో అంత పెద్దమొత్తంలో ఓటింగ్ ఏవిధంగా జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. చివరి రెండు గంటల్లో అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు ఇష్టానుసారంగా రెచ్చిపోయారు. దూరప్రాంతాల నుంచి రాని ఓటర్ల ఆధార్ కార్డుల జిరాక్స్‌లు సంపాదించి ఓట్లు వేసిన పరిస్థితి ఉందని పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఇతర అభ్యర్థులకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, కొంతమంది ఓటర్లు సైతం చెబుతున్నారు. జనాల అంచనా ప్రకారం ఏడు నుంచి ఎనిమిది శాతం దొంగ ఓట్లు పోలయ్యాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మధ్యాహ్నం రెండు గంటల వరకూ పిడిఎఫ్ అభ్యర్థికి అనుకూలంగా ఓటింగ్ సాగుతందనే ప్రచారంతో అధికార పార్టీ నేతలు చివరిలో ఈ తరహా ఓటింగ్‌కు దిగినట్లు తెలుస్తోంది. పెదవేగి వంటి మండలాల్లో దొంగ ఓట్లపై నిలదీసిన పిడిఎఫ్ నాయకులపై అధికార పార్టీ నేతలు పోలీసులు చూస్తుండగానే దాడికి దిగడమే దీనికి నిదర్శనం. అధికారంలో ఉన్నవారు ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిందిపోయి అడ్డదారుల్లో ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నించడంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మధ్యాహ్నం రెండుగంటల తర్వాత పోలింగ్ బూత్‌ల సమీపంలోనే ఓటర్లకు డబ్బు పంపిణీ విచ్చలవిడిగా సాగింది. పోలీసులు ఎక్కడా అడ్డుకోని పరిస్థితి నెలకొంది. వీటన్నింటినీ అధికారులు కట్టడి చేయకపోవడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - తణుకు

సిట్టింగ్ ఎంఎల్‌సి, ప్రస్తుత పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మణరావుపై కూటమి కార్యకర్తలు మంగళగిరిలో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఇలా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రతిపక్షం లేకుండా పరిపాలన సాగించుకోవడం అసమర్థుల పరిపాలన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అనేది గీటురాయి వంటిదని, అది ఉంటేనే వారు చేసే తప్పులు సరిదిద్దుకునే అవకాశాలు ఉంటాయని మునిస్వామి అన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ప్రజల పక్షాన గత 20 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక ఈ దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.అంబేద్కర్, పొట్ల సురేష్, నేతల సోమేశ్వరరావు, బి.రాజేంద్రప్రసాద్, వి.రాంబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రీసర్వేకు రైతులు సహకరించాలి
జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కాళ్ల

భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహించడానికి రైతులు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. కాళ్లలో జరుగుతున్న రీ సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను, మ్యాప్‌లను జెసి శుక్రవారం పరిశీలించారు. రీ సర్వే చేసే ముందు అధికారులు మీకు నోటీసులు అందజేసి స్వయంగా సమాచారం తెలియజేస్తున్నారా అని అడిగి తెలుసుకుని మాట్లాడారు. దస్తావేజుల్లో తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి సరిచేయించుకోవాలన్నారు. భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. రైతుల భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించి రికార్డులు ఆధునికీకరణ చేసేందుకు రీ సర్వేలో ఎటువంటి తప్పిదాలు లేకుండా నిర్వహించాలన్నారు. తహశీల్దార్ కార్యాలయాన్ని జెసి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ గొల్లమంద సుందర్ సింగ్, మండల సర్వే ఎన్.ప్రవీణ్, ఆర్ఐ లక్ష్మీకిరణ్, విఆర్ఒ శివ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

2న ట్రెజరీస్, అకౌంట్స్ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - భీమవరం

ఎపి ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా, సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించినట్లు ఉప ఖజానా అధికారి జె.రామారావు తెలిపారు. ఎన్నికల అధికారిగా ఎపి టిఎఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్, సహాయ ఎన్నికల అధికారిగా జి.నరేంద్రకుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఎ.ఆంజనేయులు వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలోని ట్రెజరర్స్ అండ్ ఎకౌంట్స్ డిపార్ట్మెంట్‌కు సంబంధించిన ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రెండు పూటలా ఫొటోల విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధి హామీలో రెండు పూటలా ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దేవ గ్రామంలో తాగునీటి చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి షేక్ పాదుషా, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్నీడి వెంకటేశ్వరరావు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ఫొటో విధానం కూలీలకు చాలా ఇబ్బందిగా ఉందని, పే స్లిప్పులు లేకపోవడం వల్ల వేతనం ఎంత పడిందో తెలియడం లేదని, బ్యాంకుల కంటే పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా వేతనం అందించే ఏర్పాటు చేయాలని కూలీలు కోరారు. ఈ సందర్భంగా సత్యనారాయణ వెంకటేశ్వరరావు, పాదుషా మాట్లాడుతూ ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయని తెలిపారు. 10:30 కల్లా పని పూర్తి చేసి మస్టర్ వేసే విధానం చేపట్టాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీలో వేతనం పెంచి పనిదినాలు పెంచాలన్నారు. గురువారం పని పూర్తయిన తర్వాత అస్వస్థకు గురై చనిపోయిన పిల్లి లక్ష్మీ కుటుంబానికి ప్రభుత్వం నుండి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి నల్లూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు కూలీలకు ఉపాధితో పాటు గ్రామ మౌలిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడతాయని, దీనికి నిధులు మరింత పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి శ్రీదేవి, పి.లలిత, విల్సన్, రాంబాబు, వెంకటరత్నం పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేతలు

10న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - యలమంచిలి

ఈ నెల 10వ తేదీన జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని దొడ్డిపట్లలో అంగన్‌వాడీ అండ్ హెల్పర్లతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అంగన్వాడీలకు రూ.26,000 వేతనం ఇవ్వాలని, మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా పరిగణించి పిఎఫ్, పెన్షన్, గ్రాడ్యూటీ అమలుచేయాలని కోరుతూ ఈ నెల 10న జరిగే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ, దుర్గ, లక్ష్మి, చిన్నితల్లి, విజయలక్ష్మి, యామిని, సుజాత, నిర్మలకుమారి పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఉండి

నేటి నుంచి మార్చి 15వ తేదీ వరకు తమ కళాశాలలో జరిగే ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం జరిగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 243 మంది విద్యార్థులు హాజరౌతారని, వీరికి కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ ప్రాంగణం 100 మీటర్ల వరకు బయటివారిని అనుమతించేది లేదని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఆచంట : మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.శ్రీదేవి తెలిపారు. ఆచంట ఎంపిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 212 మంది పరీక్షలు రాయనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో, 144 సెక్షన్ అమలుతో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా గంగాధర్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కాసే గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం టిటిడి కల్యాణమండపంలో శుక్రవారం ఉదయం నిర్వహించారు. గోల్డెన్ ఫొటో స్టూడియో అధినేత కె.గంగాధర్ రావును కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని, సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీ ద్వారా, సీనియర్ ఫొటోగ్రాఫర్ల సమక్షంలో కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించి, అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రయత్నం చేస్తానని, ఫొటోగ్రాఫర్లకు అన్ని విధాల కొత్త కమిటీ ద్వారా సమస్యలు పరిష్కరించే దిశలో ముందుకుసాగుతానని గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల ఛైర్మన్ ఎం.రాము, తాడేపల్లిగూడెం అసోసియేషన్ ప్రెసిడెంట్ ముల్లపూడి చిరంజీవి, సెక్రెటరీ బి.సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రై డే పాటిద్దాం

తాడేపల్లిగూడెం : పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య నియమాలను పాటించుట ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని మలేరియా అధికారి లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం కడకట్ల ఆరోగ్యకేంద్రం పరిధిలోని 28, 31లలో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : హెచ్‌ఎం

ఉండి : ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముక్కు వెంకట సత్యనారాయణ అన్నారు. ఆకివీడు మండలం సిద్దాపురం జెడ్‌పి పాఠశాలలో ఫిబ్రవరి 24, 25 తేదీలలో నిర్వహించిన నియోజకవర్గ క్రీడా పోటీలలో రాణించిన ఎన్ఆర్‌పి అగ్రహారం జెడ్‌పి పాఠశాల విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముక్కు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు ముఖ్యమైనవని, తమ పాఠశాలకు సరైన క్రీడా మైదానం లేకపోయినప్పటికీ తమ పాఠశాల విద్యార్థులు ఎంతో పట్టుదలతో సాధన చేసి, నియోజకవర్గ స్థాయిలో తమ పాఠశాలను నిలబెట్టారని అన్నారు. అనంతరం బాలుర విభాగంలో 100 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, డిస్కస్ త్రోలో తృతీయ స్థానం సాధించిన పి.చంద్రశేఖర్ నాయుడు(8వ తరగతి), బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన పి.సరిత(9వ తరగతి), షాట్‌పుట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన బాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఇటి ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫారం క్యాంపస్ ఇంటర్వ్యూకు 37 మంది

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈనెల 27వ తేదీన వ్యవసాయ డిప్లొమా చేసిన వారి కోసం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఈవెంట్‌కు మంచి స్పందన లభించింది. 37 మంది అభ్యర్థులు హాజరు అయ్యారని ప్రాంత సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామీణ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ సంస్థ ద్వారా ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారని, వీరిలో అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో రాజీకి ప్రయత్నించాలి

భీమవరం టౌన్ : 3వ అదనపు జిల్లా కోర్టులో పెండింగ్ లో ఉన్న మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి ప్రయత్నించాలని 3వ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.ఎస్.వి.హిమబిందు కోరారు. శుక్రవారం న్యాయమూర్తి పోక్సో కోర్టులో ఇన్సూరెన్స్ కేసుల్లో న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్ గురించి ప్రత్యేకంగా సమావేశమై పెండింగ్ కేసుల రాజీకి కృషిచేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ ఆదపాల ప్రసన్న కుమార్, న్యాయవాదులు నిమ్మల నవీన్, కెవి.రమేష్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా కామవరం విద్యార్థులు

తణుకు రూరల్ : జిల్లా సెంటర్ జోన్ గేమ్స్ బాలికల కబడ్డీ పోటీలో మండలంలోని కొమరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల కబడ్డీ జట్టు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించి రన్నర్స్‌గా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి తెలిపారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలు తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

మద్యం నిల్వలపై పూర్తి స్థాయి విచారణ : సిఐ

నరసాపురం : మండలంలోని కొప్పర్రులో బెల్ట్ షాపు పెట్టి మద్యం నిల్వలు ఉంచిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని నరసాపురం ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఇప్పటికే ఈ అక్రమ మద్యం నిల్వలపై కేసు నమోదు చేశామని, ఈ విషయంలో నిగ్గుతేల్చేందుకు విచారణ అధికారులు భీమవరం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ రెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులు ఇప్పటికే 14 రోజుల రిమాండ్ విధించిందని, పూర్తిస్థాయిలో విచారణ కొనసాగుతుందని తెలిపారు.

ఇంటి యజమానులు ఉండగానే భారీ చోరీ

తణుకు రూరల్ : ఇంట్లో అందరూ ఉండగానే దొంగలు భారీ చోరీకి పాల్పడిన ఘటన తణుకు మండలం పైడిపర్రులో చోటుచేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 4.15 గంటలకు ఇంటి తలుపు తెరిచి ఉంచగా బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తణుకు రూరల్ ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

మొగల్తూరు : రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. కేపీపాలెం నార్తులో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రాంతాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజకిశోర్, సర్వేయర్ ధనరాజు ఉన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి కలిగి ఉండాలి

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


భీమవరం టౌన్ : ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఉండి

చిన్నారులకు విద్యార్థి దశ నుంచే విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించాలని శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఉద్దేశించి వారు మాట్లాడుతూ సర్ సివి రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను ఆవిష్కరించిన రోజున సైన్స్(జాతీయ విజ్ఞాన) దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించిన సందర్భంగా సర్ చంద్రశేఖర వెంకట రామన్‌కు నోబెల్ బహుమతి లభించిందని, అనంతరం భారత అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డును భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : విద్యార్థులు విద్యతో పాటు సైన్సుపై ఆసక్తి కలిసి కలిగి ఉండాలని గణపవరం ఎంఇఒ జి.బాలయ్య అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా శుక్రవారం జల్లికొమ్మర యుపి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్సు ప్రాజెక్టులను పరిశీలించి,


గణపవరంలో..

వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటకం సుందరకుమార్, ఉపాధ్యాయులు సిహెచ్.లీలాగోపాల్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : విజ్ఞానం దేశ అభివృద్ధికి అత్యంత అవసరమని, విద్యార్థులు చక్కటి నూతన ఆవిష్కరణలు చేయాలని న్యూక్లియర్ ఆటోనమిక్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎన్‌వి.విశ్వనాథం కోరారు. శుక్రవారం మండలంలోని మార్టేరు వివేకానంద స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు మోడళ్లు, ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. ముఖ్యంగా, విద్యార్థులు రూపొందించిన సౌరశక్తితో నడిచే మోడళ్లు, స్వయం నియంత్రిత రోబోట్స్, ఎకో-ఫ్రెండ్లీ ఇన్నోవేషన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా వీక్షించారు. మానవత అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి ఉన్నారు.

పాలకొల్లు : స్థానిక జివిఎస్‌వి‌ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గుమ్మళ్ల వీరస్వామి, లావణ్య హాస్పిటల్ అధినేత డాక్టర్ స్వరూప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం.భవానీప్రసాద్ రాయపూడి, ఉపాధ్యాయులు త్రిమూర్తులు పాల్గొన్నారు. స్థానిక శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.


కాళ్ల : విద్యార్థి దశ నుండే సైన్స్ పట్ల ప్రతిఒక్కరూ ఆసక్తిని పెంపొందించుకోవాలని మండల


పాలకొల్లులో..

విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలిలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు తయారుచేసిన ప్రాజెక్టులను ఎంఇఒ ఎ.రవీంద్ర పరిశీలించి ప్రశంసించారు. హెచ్‌ఎం ఎవి.సుబ్బరాజు, బిఆర్‌ఎంకె.స్వామి, ఎన్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: జెడ్‌పి పాఠశాల లంకలకోడేరులో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అతి తక్కువ ఖర్చుతో రూపొందించిన వివిధ భౌతిక, జీవ శాస్త్ర మోడల్స్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

తాడేపల్లిగూడెం: ఆదిత్య చిన్నారులను చూస్తుంటే భవిష్యత్తుతో భావిభారతదేశానికి కాబోయే ఇంజనీర్లు వలే చూడముచ్చటగా ఉన్నారని తాడేపల్లిగూడెం టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పేర్కొన్నారు. శుక్రవారం ఆదిత్య స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన 300 రకాల సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎస్ఎన్ఎస్.అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాలకొల్లు రూరల్‌లో..

భీమవరం టౌన్ : స్థానిక అడ్డవంతెన వద్ద ఉన్న ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం నేషనల్ సైన్స్ డే ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ కరెస్పాండెంట్ అండ్ డైరెక్టర్ డాక్టర్ లయన్స్ కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా


పెనుమంట్రలో..

ఫిబ్రవరి 28వ తేదీన జాతీయ సైన్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. తమ స్కూల్ విద్యార్థులు 100కు పైగా సైన్స్ ప్రాజెక్టులు తయారు చేశారన్నారు. కొందరు విద్యార్థులు సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ పాటలు, ప్రసంగాలు చేశారని ప్రైమరీ ప్రిన్సిపల్ బి.యుగాసుధ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెవి.సత్యనారాయణ, దుర్గమ్మ, సైన్స్ టీచర్లు ఎస్‌కె.బాబా, జిఎన్‌వికె.మోహన్, జె.సుధారాణి, గజలక్ష్మి పాల్గొన్నారు.

భారతదేశంలో ఉన్న అపారమైన వనరులను ఉపయోగించి దేశ ఆర్థిక ప్రగతికి, అభివృద్ధికి ఉపయోగపడే ఉత్పత్తులు తీసుకురావాలని యువ ఇంజనీర్లను జిల్లా హార్టికల్చర్ అధికారి ఆర్.దేవానంద్ కుమార్ కోరారు. సైన్స్ డేని పురస్కరించుకొని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అనుసంధానం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ పరిశీలించి అభినందించారు. డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దివాకర్‌తో పాటు ఇంజనీరింగ్ కెమిస్ట్రీ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు : తణుకు రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో శుక్రవారం మెగా సైన్స్ డే ను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలియజేశారు. నీటి ప్రాధాన్యత, గ్లోబల్ వామింగ్, పర్యావరణ పరిరక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మానవ శరీరం, కాలుష్య నివారణ, రోబోటిక్స్, రాకెట్ లాంచింగ్, రోడ్డు ప్రమాదాలు అరికట్టే విధంగా అలారమ్స్ అనేక కొత్త కొత్త ఆలోచనలతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. సంస్థ డైరెక్టర్స్ బి.విద్యాకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజీ(అటానమస్)లో రిటైర్డ్ ఇంజనీర్, ఇస్రో, హైదరాబాద్ శ్రీవిష్ణువజ్జల, ఎస్ఎస్‌విఆర్.రమణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు.


తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం : దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు ఎంతో కీలకమని వరంగల్ నిట్ గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ జెవి.రమణమూర్తి తెలిపారు. ఎపి నిట్‌లోని స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అమరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడారు. ఆచార్యులు డాక్టర్ టి.కూర్మయ్య, డాక్టర్ జె.కృష్ణమూర్తి, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శరద్ ద్వివేది పాల్గొన్నారు.

ఘనంగా జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం

భీమవరం : జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక 38వ ఆవిర్భావ దినోత్సవాన్ని యుటిఎఫ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. జెవివి సీనియర్ నాయకులు పి.సీతారామరాజు అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు వై.అజయ్ కుమార్ జెవివి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణరావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్సు సంబరాలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు, ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు, జెవివి నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగును ప్రోత్సహించాలి : కలెక్టర్


భీమవరం : రైతులను ప్రకృతి సాగుకు ప్రోత్సహించి, వారికి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ప్రకృతి సాగు ముందస్తు ప్రణాళికపై జిల్లా స్థాయి కన్వర్జెన్సీ వర్క్‌షాప్ కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడని ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2024-2025లో 13 వేల ఎకరాలలో ప్రకృతి పంటల సాగు చేయగా, ఈ ఏడాది 50 వేల ఎకరాలను లక్ష్యంగా చేసుకొని ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రకృతి సాగు వల్ల పండించిన పంటలకు మార్కెట్ విలువ కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్-ఎస్.వేణుగోపాల్ రావు పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

నరసాపురం: మండలంలో వేంచేసియున్న శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి దేవస్థానం హుండీ మార్చి 1వ తేదీన ఉదయం 10 గంటలకు లెక్కిస్తున్నట్లు ఇఒ ఆర్‌వివిఎస్.రామచంద్ర కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు సమక్షంలో జరుగుతుందన్నారు.

దర్జీలు నైపుణ్యవంతులు

ఘనంగా టైలర్స్ డే



మొగల్తూరు : దర్జీలను సత్కరిస్తున్న ఆరోగ్య వర్షిని ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజల ఆకృతికి అనుగుణంగా దుస్తులు కుట్టడంలో దర్జీలు నైపుణ్యవంతులని ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ టైలర్స్ డేని పురస్కరించుకుని మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో దర్జీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బొడ్డు కృష్ణ భగవాన్, బొల్లా రాము, బొక్క రాజేశ్వరరావు, ఆకన వీరబాబు, కవురు నాగేశ్వరరావు ఉన్నారు.

మొగల్తూరులో టైలర్స్ డేను బాపూజీ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ టైలర్స్ డేని పురస్కరించుకుని కుట్టు మిషన్ సృష్టికర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడళ్లలో భారీ ప్రదర్శన చేశారు. అనంతరం పేరుపాలెం బీచ్ ప్రాంతానికి ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా తరలి వెళ్లి సహపంక్తి భోజనాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆ సంఘ అధ్యక్షులు బొల్లా రాము, కార్యదర్శి పడవల నారాయణ, కోశాధికారి సరాబు సూర్యనారాయణ, సభ్యులు బొక్క రాజేశ్వరరావు, కవురు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సమాజంలో టైలర్ వృత్తికి ప్రాముఖ్యమైన స్థానం ఉందని, మనిషి హుందాగా కనిపించే విధంగా దుస్తులు రూపొందించే కళ టైలర్స్‌కే సాధ్యమని వేల్పూరు గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి అన్నారు. వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో 180వ టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘ పతాకాన్ని సంఘం అధ్యక్షులు మల్లేశ్వరపు నాగరాజు ఎగరవేశారు. అనంతరం ఎలియాస్ హోవే విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీనియర్ టైలర్స్ బత్తుల కోటేశ్వరరావుని శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్ర రావు మాట్లాడుతూ పభుత్వం తక్షణం స్పందించి ఉచిత బీమాతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 50


తణుకు రూరల్ :సీనియర్ టైలర్లను సన్మానిస్తున్న సర్పంచి కృష్ణవేణి

సంవత్సరాలు నిండిన ప్రతి టైలర్‌కి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, ప్రతి టైలరింగ్ షాప్‌కు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, తాడిశెట్టి కోట వెంకటేశ్వరరావు, కరేళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆకివీడు : కుట్టు మిషన్‌ను కనిపెట్టి దానికి ఒక రూపం ఇచ్చి ఎందరికో జీవితాన్ని ఇచ్చిన మహానుభావుడు ఎలియాస్ హోవే అని పలువురు టైలర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆయనకు నివాళి ఘటించారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి సమర్పించి, పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

వల్లూరులో ఇందుకూరి రామం వర్ధంతి

ఆచంట : డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఇందుకూరి రామం 43వ వర్ధంతి వేడుకలు వల్లూరు సెంటర్‌లో ఆయన స్థూపం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకూరి రామం చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో పాల్గొని డివైఎఫ్ఐ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొర్రా ధర్మారావు, జోగి వెంకట సత్యనారాయణ, పంది అప్పారావు, సూర్యనారాయణ, సత్యనారాయణ వెంకటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీరాములు పాల్గొన్నారు.

వైద్యుడు నాగేశ్వరరావు మృతి తీరని లోటు


పెంటపాడు : ప్రముఖ వైద్యుడు డాక్టర్ కర్రి నాగేశ్వరరావు మృతి వైద్య రంగానికి, పేద ప్రజానీకానికి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద డాక్టర్ కర్రి నాగేశ్వరరావు మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం చింతకాయల బాబురావు మాట్లాడుతూ డాక్టర్ కర్రి నాగేశ్వరరావు వైద్యరంగంలో ఎనలేని కృషి చేశారని వారి సేవలను కొనియాడారు. సుబ్బారావు పేటలోనే కాకుండా తాడేపల్లిగూడెం చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి భాస్కర్ రావు హాస్పిటల్‌కు వందలాది మంది జనం వచ్చి ఆయన వైద్య సేవలు పొందారని, అటువంటి కృషినే డాక్టర్ కర్రి నాగేశ్వరరావు కుమారుడు భాస్కరరావు కూడా అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరవరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, దత్తు రాము, మీసాల శ్రీను ఉన్నారు.

ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పదు : కమిషనర్

నరసాపురం : విధుల పట్ల అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. శుక్రవారం పురపాలక సంఘంలో వాటర్ వర్క్స్‌లో పనిచేయుచున్న జె.రామారావు ఉద్యోగవిరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన సభలో కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పదన్నారు. నరసాపురం పురపాలక సంఘంలో వాటర్ వర్క్స్‌లో రామారావు వారి సర్వీస్‌లో అందజేసిన సేవలు అమూల్యమైనవన్నారు. తదుపరి శాలువా కప్పి పుష్పగుచ్చాలందించి, ఆయనను ఘనంగా సత్కరించారు. ఆర్ఐ ఎ.నానాజీ, కోటిపల్లి కాశీ, లోకేష్ పాల్గొన్నారు.

కనకరావు సేవలు మరువలేనివి

ఉద్యోగ విరమణలో పంచాయతీ అధికారులు


కనకరావు దంపతులను సత్కరిస్తున్న పంచాయతీ అధికారులు

కాళ్ల : పంచాయతీరాజ్ శాఖలో విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శిగా పి.కనకరావు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం కాళ్ల మండలపరిషత్ కార్యాలయంలో పెదఅమిరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.కనకరావు ఉద్యోగవిరమణ సందర్భంగా వీడ్కోలు సభను నిర్వహించారు. పి.కనకరావు 1989లో గ్రూప్-3లో విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యత స్వీకరించారు. 2009-2015లో బొండాడ పంచాయతీలో, ఆతరువాత మోగల్లు పంచాయతీగా, 2019 నుంచి పెదఅమిరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 35 ఏళ్లపాటు క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని అన్నారు. పనిచేసిన ప్రతిచోటా వివాదరహితుడిగా విధులు నిర్వహించడం వల్లే ఉద్యోగవిరమణ అనంతరం తమ కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పి.కనకరావు, దుర్గాశ్రీ లక్ష్మి దంపతులను కాళ్ల ఎంపిడిఒ జి.స్వాతి, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షులు డి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శుల యూనియన్ అధికారి ఎస్.వెంకటేష్, మండల పంచాయతీ కార్యదర్శి సంఘం అధ్యక్షులు డి.సునీల్ రాజు, ఉపాధ్యక్షులు బి.సతీష్ కుమార్, కోశాధికారి యేసుబాబు, కార్యదర్శి సిహెచ్.సుజాతలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎస్.అరుణాదేవి, జివి.రామకృష్ణంరాజు, ఎ.పోలయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తం

ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

నరసాపురం : పట్టణంలోని మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణితోనే పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని పలువురు వార్డు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం పురపాలక ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై అధికారులు అశ్రద్ధ చూపడం లేదని, పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు ప్రజలకు దర్శనమిస్తున్నాయని పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా క్లాప్ వాహన సేవలు ఎందుకు నిలుపుదల చేశారని అధికారులను నిలదీశారని వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, కేసరి గంగరాజు ప్రశ్నించారు. ఆర్పీలను లైంగికంగా వేధిస్తున్న మెప్మా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 22వ వార్డు కౌన్సిలర్ భారతి సురేష్ ఛైర్‌పర్సన్ పోడియం ముందు నేలపై కూర్చుని నల్లకుండువా ధరించి నిరసన తెలిపారు. సురేష్‌కు మద్దతుగా వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామల మాట్లాడారు. దీనిపై రెండు, మూడు రోజుల్లో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానమిచ్చారు. తాగునీరు, వీధి దీపాలు, శానిటేషన్, డ్రెయినేజీ, పలు సమస్యలపై కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు.